# 2

# చరిత్ర గ్రంథాలు

*ప్రారంభమునకు: పాత నిబంధనలోని చరిత్ర గ్రంథాలలోని సాహిత్యశైలి ఎక్కువగా వృత్తాంతములవలె కనబడుతుంది. వృత్తాంతములను వ్యాఖ్యానించునప్పుడు వ్యాఖ్యానకర్త చరిత్ర కథను అర్థం చేసుకోవడానికి నాలుగు పనులు చేయాలి మరియు మూడు విషయాలను గుర్తుంచుకోవాలి. పాత నిబంధనలో వృత్తాంతములే ఎక్కువగా కనబడతాయి.*

## పరిచయం

చరిత్ర గ్రంథాలు, అనగా యెహోషువనుండి ఎస్తేరు వరకు గల గ్రంథాలు ఇశ్రాయేలు కనానులో ప్రవేశించడం మొదలుకొని పాత నిబంధన కాలం ముగించడానికి రెండు నుండి నాలుగు వందల సంవత్సరాల ముందు వరకుగల చరిత్రను చెప్తున్నాయి. ప్రతి చరిత్ర గ్రంథంలో చెప్పబడిన వివరాలను క్లుప్తంగా ఇక్కడ చూద్దాము.

*యెహోషువ* – పంచకాండాలలో చెప్పబడిన వివరాలను కొనసాగిస్తూ, కనానును జయించడం, దేశాన్ని పంచుకోవడం వంటి విషయాలను యెహోషువ గ్రంథం చెప్తుంది.

*న్యాయాధిపతులు* – న్యాయాధిపతుల కాలం ఎన్నో వందల సంవత్సరాల కాలం. ఇందులో ఇశ్రాయేలు తరుచూ దేవునినుండి తొలగిపోవడం, ఇతర దేశస్థులవలన త్రొక్కబడడం, న్యాయాధిపతులచే విడిపించబడడం వంటి విషయాలున్నాయి.

*రూతు* – న్యాయాధిపతుల కాలంలో ఒక మోయాబీయురాలు యూదామతంలోకి వచ్చి దావీదు వంశంలో చేర్చబడడం గురించి ఉంది.

*1 మరియు 2 సమూయేలు* – ఈ పుస్తకాలలో న్యాయాధిపతుల కాలం ముగింపునుండి ఇశ్రాయేలు రాజ్యముగా అవతరించడం వరకు చరిత్ర ఉంది. 1 సమూయేలు సౌలు రాజ్యపాలన గురించి చెప్తుండగా, 2 సమూయేలు దావీదు రాజ్యపాలన గురించి చెప్తుంది.

*1 మరియు 2 రాజులు* – 2 సమూయేలు ఎక్కడ మూగించబడిందో అక్కడనుండే 1 రాజులు ఆరంభమై సొలొమోను రాజ్యపాలన గురించి వివరిస్తుంది. ఈ గ్రంథాలలో రాజ్యం విభజింపబడడం దక్షణరాజ్యమైన యూదా రాజ్యం ఏర్పడడం వంటి సంగతులున్నాయి. యూదా రాజ్యం పతనమవడం, బబులోను చెరలోకి వెళ్ళడంతో 2 రాజులు గ్రంథం ముగిస్తుంది.

*1 మరియు 2 దినవృత్తాంతములు* – ఈ గ్రంథాలు కూడా యూదా మరియు ఇశ్రాయేలు వృత్తాంతములనే చెప్తున్నాయి కాని, సమూయేలు మరియు రాజులు గ్రంథాలలో వివరించినవాటికంటే భిన్నంగా ఉంటాయి. 1 దినవృత్తాంతముల గ్రంథం వంశావళితో ఆరంభమై ఆదాము వరకు చెప్తుంది. తరువాత సౌలునుండి బబులోను చెరవరకు గల దేవుని ప్రజల వృత్తాంతమును ఇది చెప్తుంది. యూదులు తమ స్వదేశమునకు తిరిగి వెళ్ళవచ్చునన్న ఆజ్ఞతో 2 దినవృత్తాంతములు ముగిస్తుంది.

*ఎజ్రా* – యూదులు మొదటి గ్రంథం బబులోను చెరనుండి తిరిగి రావడం, దేవాలయమును పునఃనిర్మించడం మరియు ఎజ్రా చేత పునరుద్ధరణవంటి విషయాలు ఇందులో ఉన్నాయి.

*నెహెమ్యా* – ప్రజలు బబులోను నుండి తిరిగివచ్చిన తరువాత యెరూషలేము గోడలను తిరిగి నిర్మించారు. అలాగే యిర్మీయా ఆధ్వర్యంలోని పునరుద్ధరణ, నిబంధనను పునరుద్ధరించబడడం వంటి విషయాలు ఇది చెప్తుంది.

*ఎస్తేరు* – క్రీ.పూ. 480లో పర్షియా దేశములో ఒక యూదా యువతి ఆ దేశానికి రాణి అయి తరువాత నాశనంనుండి తన ప్రజలను ఎలా కాపాడుకున్నదన్న వివరణ ఉంది.

రెండు భాగాలుగా ఉన్న గ్రంథాలు – 1 మరియు 2 సమూయేలు, 1 మరియు 2 రాజులు, మరియు 1 మరియు 2 దినవృత్తాంతములు నిజానికి ఒక గ్రంథమే! హెబ్రీ బైబిల్లో ఇప్పటికీ సమూయేలు ఒక గ్రంథంగా, రాజులు ఒక గ్రంథంగా, దినవృత్తాంతములు ఒకే గ్రంథంగా ఉంది. అలాగే హెబ్రీ బైబిల్లో, యెహోషువా, న్యాయాధిపతులు, సమూయేలు మరియు రాజుల గ్రంథాలు ప్రవక్తల గ్రంథాల్లో "తొలి ప్రవక్తలుగా" చెప్పబడ్డాయి. "చరిత్ర" గ్రంథాల్లో మిగిలిన గ్రంథాలు హెబ్రీ లేఖనాలలో "రచనలుగా" (*Kethubim*) పిలువబడుతున్నాయి.

చరిత్ర గ్రంథాలు నిజానికి రెండు సమాంతర చరిత్రను అందిస్తున్నాయి. ఒకటి కనానును జయించడం మొదలుకొని బబులోను చెర తరువాతే కనానులో తిరిగి ప్రవేశించడం వరకు చెప్పే తొలి ప్రవక్తలు కాగా, మరొకటి దావీదు మరియు సొలొమోను పాలనలోని సమైక్య రాజ్యంతో ప్రారంభమై (వంశావళి తరువాత), యూదులు బబులోను చెరనుండి తిరిగి రావడం వరకు దినవృత్తాంతములు, ఎజ్రా, నెహెమ్యా గ్రంథాలలో కనిపిస్తుంది! మిగిలిన రెండు గ్రంథాలు చరిత్రను మరింత వివరంగా వివరించనప్పటికి అవి వీటితో జతచేయబడ్డాయి. ఎందుకంటే, అందులోని వివరాలు వీటి కాల సమయంలోనే జరిగాయి: రూతు గ్రంథంలోని విషయాలు న్యాయాధిపతుల కాలంలో జరిగాయి. ఎస్తేరు కాలంలోని సంగతులు ఎజ్రా మరియు నెహెమ్యాల కాలంలో జరిగాయి.

## పాత నిబంధన చరిత్ర యొక్క లక్షణాలు

పాత నిబంధన చరిత్ర ఎలా ఉంది?

*మొదటిగా, పాత నిబంధన చరిత్ర ఎన్నుకోబడిన చరిత్ర.* ఇందులో ప్రతి వివరణ లేదు కానీ, గ్రంథకర్త ఉద్దేశాన్ని పూర్తిచేసేంత సమాచారం మాత్రమే ఉంది. విభిన్న గ్రంథాలకు విభిన్న ఉద్దేశాలున్నా గాని, సాధారణంగా చెప్పాలంటే, దీని స్థూల ఉద్దేశం మాత్రం మత మరియు వేదాంతపరమైనది. ఇది దేవుని గురించి, ఆయన ఉద్దేశం, ఆయన ప్రణాళికను గురించి చెప్తుంది. కాబట్టి చరిత్రపరంగా రాజకీయపరంగా ప్రాముఖ్యమనుకున్న విషయాలను విడిచి పెట్టి దేవుని ప్రజల విషయంలో ఏది యుక్తంగా ఉంటాయో అవి మాత్రం చేర్చబడ్డాయి.

ఇందుకు ఉదాహరణ క్రీ.పూ. 9వ శతాబ్దంలో ఉత్తర రాజ్యపు రాజైన ఒమ్రీ విషయంలో కనబడుతుంది. అప్పటి పొరుగు రాజ్యాల వివరణనుబట్టి ఒమ్రీ ఒక శక్తివంతమైన రాజు అని మనకు అర్థమవుతుంది. అతని మరణంనుండి వంద సంవత్సరాల తరువాత కూడ అష్షూరు వారు ఇశ్రాయేలు "ఒమ్రీ యొక్క ఇల్లుగా"[1] పిలిచారు. అయితే, బైబిలు రచయిత మాత్రం అతని రాజ్యాపాలనకు కొన్ని వచనాలు మాత్రమే (1 రాజులు 16:16–28) కేటాయించాడు.

ఎందుకు? అతడు రచయిత దృష్టిలో ఒక దుర్మార్గపు రాజు. దేవుని ఉద్దేశాలను నెరవేర్చేందుకు సహకరించనివాడు. అతడు లోకం దృష్టిలో ప్రముఖరాజు కానీ 1 మరియు 2 రాజుల విషయంలో మాత్రం అతడు నీచుడు, ఎందుకంటే దైవావేశితుడైన గ్రంథకర్త మతపర కోణం నుండి దీన్ని వ్రాశారు.

బైబిలు చరిత్ర ఎన్నుకోబడినదైతే, అది పొరపాటైనదా? అది ఎంతో విస్తారమైన విషయం కలిగినదా? లేక అది పురాణమా? చరిత్ర కాదా? అలాకాదు, నిజానికి బైబిలు చరిత్ర విషయంలో చెప్పబడినది ఏ చరిత్ర విషయం లోనైనా చెప్పబడుతుంది. అది ఎన్నుకోబడింది లేదా ఏరిఏరికూర్చబడింది. చరిత్ర వ్రాయడం అనేది ఎన్నుకోబడినట్లుగానే ఉండాలి. ఎందుకంటే ప్రతి సంఘటనకు చరిత్రలేదు. “ఎన్నికచేయబడింది” అన్న సూత్రం చరిత్ర వ్రాయడంలో ఎంత గర్హణీయమో, అలాగే గ్రంథకర్త యొక్క ఉద్దేశం కూడా అంతే ప్రాముఖ్యం; ఆ ఉద్దేశం ప్రకారంగానే చరిత్రలో ఏ విషయాలను చేర్చాలన్నా అభిప్రాయం ఆధారపడియుంటుంది. బైబిలులోని చరిత్రను వ్రాయడం అనేది, లోకపర చరిత్రను వ్రాయడంకు విభిన్నమైనది. ఎందుకంటే, ఆ వ్యత్యాసం దాని ఎన్నిక చేయబడిన విషయంలోనే ఉంటుంది.

*రెండవదిగా, పాత నిబంధన చరిత్ర నమ్మదగిన చరిత్ర. బైబిలు చరిత్రకారుని ఉద్దేశం.* నవీన చరిత్రకారుని ఉద్దేశమునకు సరిపడనిది కాదు కాబట్టి మనకు తెలిసిన చారిత్రక సత్యములను బట్టి బైబిలు చరిత్రను ధృవీకరించడం అన్ని వేళలా సాధ్యంకాదు. లెక్క ప్రకారం, పురాతన చరిత్రననుసరించి అద్భుతాలను ధృవీకరించాలనుకోవడం అవివేకం. అయితే, చరిత్ర సత్యములననుసరించి బైబిలు చరిత్రను చూసినప్పుడు అది సత్యమైనదిగా కనబడుతుంది.

*మూడవదిగా, పాత నిబంధనలో వ్రాయబడిన చరిత్ర చక్కగా వ్రాయబడిన చరిత్ర.* (ఏ) ఇతర దేశాల సమకాలీన రాజుల చరిత్రకు భిన్నంగా ఇది సంఘటనల కారణాలు, ఫలితాలను గురించి చెప్తుంది. (బి) పురాతన తూర్పు రాజులను గురించి అతిశయంగా చెప్పే కథలకు విరుద్ధంగా ఇది నిక్కచ్చిగా వారి బలహీనతలను గురించి కూడా చెప్తుంది (సి) ఇది విలువైన సమాచారాన్ని ఇస్తూ జీవితానికి సత్యమునే చెప్తుంది.

## పాత నిబంధన చరిత్రను వ్యాఖ్యానించడము

పాత నిబంధనలోని చరిత్ర గ్రంథాలలోని సమాచారానికి సంబంధించి వ్యాఖ్యాన కర్తలకు నాలుగు పనులున్నాయి:

1. *సంఘటనలు లేదా వృత్తాంతాలను చారిత్రిక నేపథ్యంలో చూపించడం,* ప్రత్యేకించి ఇశ్రాయేలు చరిత్రను బైబిలుకు సంబంధించి చూపడం. ఇది ఎప్పుడు జరిగింది? ఏది ముందు జరిగింది, దీని కారణం ఏమిటి? దాని తరువాత ఏం జరిగింది? ఆ సంఘటన యొక్క ఫలితాలు ఏమిటి? బైబిలు వృత్తాంతములను “చారిత్రక కోణం” నుండి అర్థం చేసుకోవాలి. సంఘటనలు ఆ సంఘటనలు జరిగాయి, వాటి ప్రతిఫలం లభించింది వాటిని ఆధారంగా గ్రహిస్తె బైబిలు వివరణ అర్థవంతంగా ఉంటుంది.

2. *సంఘటన నిజంగా జరిగినదా లేదా అని ప్రశ్నించడం.* లేఖనాలను సంప్రదాయ చూసేవారు ఈ ప్రశ్న అసలు అవసరమా అని అనుకుంటారు. ఎందుకంటే, మనం బైబిలును దైవావేశిత చారిత్రక పుస్తకం అని నమ్ముతాము. బైబిలులో ఒక సంఘటన జరిగిందని చెప్తే,

అది జరిగిందనే మనం నమ్ముతాము. అయితే ఒక సంఘటన యొక్క చరిత్రను సత్యాన్ని మనం రెండు కారణాలు వలన గ్రహించవలసి ఉంటుంది, కొంతమంది దాని చారిత్రక ఆధారాన్ని ప్రశ్నిస్తుంటారు. అటువంటప్పుడు, ఆ ప్రశ్నకు విశ్వాసులు స్పందించవలసియుంది. రెండవదిగా, ఒక సంఘటనను గురించి బైబిల్లోని భిన్నత్వం పలు ప్రశ్నలను రేకెత్తించవచ్చు. అనగా, ఆ సంఘటన దానికదే వివాదాస్పదంగా ఉండవచ్చు లేదా అది ఇతర బైబిలు వాక్యభాగాలతో విభేదించవచ్చు. ఈ స్పష్టమైన విభేదం మరింత లోతుగా అధ్యయనం చేసేలా చేస్తుంది. ఒక సంఘటన యొక్క చారిత్రక సత్యతను నిరూపించేందుకు మార్గమేమంటే, ఆ సంఘటనకు సంబంధించి దాన్ని బలపరచేలానున్న చారిత్రక విషయాలను దానికి జోడించి చెప్పడం.

3. *సంఘటన దాని చారిత్రక, సామాజిక మరియు సాంస్కృతిక నేపథ్యంలో అర్థం చేసుకోవడం.* మనకు సాధ్యమైనంతవరకు అసలు ఏం జరిగింది, ఎలా జరిగింది, ఎప్పుడు జరిగింది, ఎక్కడ జరిగింది, ఎందుకు జరిగింది అన్న విషయాలను మన సమయంలో గాకుండా సంఘటన సమయం, స్థలాల ననుసరించి పరిశోధించాలి. సంఘటన యొక్క కారణాలు మనకు తార్కికంగా అనిపించవు గాని, ఆ సంఘటన జరిగినప్పుడు అప్పటి చారిత్రక, సాంస్కృతిక సందర్భాలు ఆ ప్రజలకు చక్కగా అర్థమైయుంటాయి.

ఉదాహరణకు, దావీదు గొల్యాతును చంపడం (1 సమూయేలు 17:2-51) ఈనాటి ప్రజలకు అంతగా అర్థంకాదు. ఇప్పటి కాలంలో రెండు సైన్యాలు యుద్ధానికి దిగినప్పుడు ఇద్దరు వ్యక్తులలో ఒకరు గెలిస్తే, వారివైపున ఉన్నవారు గెలవడం అనే విషయం ఎవరూ ఒప్పుకోరు. అయితే ఇటువంటి యుద్ధ కథలు గ్రీసులో కూడానున్నాయి.[2] ఇరు దేశాల మధ్య యుద్ధం జరుగుతున్నప్పుడు అందులోని ఇరుపక్షాల యోధులు తలపడతారు. గెలిచిన వానికి విజయం అతడి ఒక్కడిదే కాదు కాని అతనితోపాటు అతని దేశానికి కూడా! ఓడిపోయినవారు తమ ఆయుధాలు విడిచి లొంగిపోయేవారు. గొల్యాతు ఫిలిష్తీయుల పక్షంవాడు. అతడు గ్రీసు (లేదా దగ్గరప్రాంతం) నుండి పాలెస్తీనాకు వచ్చాడు.

దేవుని వాక్య వ్యాఖ్యానకర్తలముగా మనం జాగ్రత్తగా నుండాలి. బైబిలులో చెప్పబడిన ఒక చారిత్రక సంఘటనను పరిశీలిస్తున్నప్పుడు మనకు ఏం తెలుసు, ఏం తెలియదు అన్నవాటి మధ్యగల తేడాను తెలుసుకోగలగాలి. ఆ సంఘటన విషయంలో ఏది సత్యం కావచ్చు మరియు ఏది స్థిరం అన్నవాటి మధ్యగల భేదాన్ని గుర్తించగలగాలి.

4. *వ్రాయబడిన దాని అర్థాన్ని, దాని ప్రాధాన్యతను గుర్తించాలి.* బైబిలు చరిత్రకారులు కేవలం చరిత్రను చరిత్రగా నిలపడానికి మాత్రమే వ్రాయాలని అనుకోలేదు కానీ వారు వ్రాసిన చరిత్రనుండి కొన్ని విషయాలను బోధించడానికి వారు ఆసక్తి చూపారు. వ్యాఖ్యాన కర్తగా మన పని ఏమంటే, "ఈ సంఘటన ద్వారా గ్రంథకర్త ఏం చెప్పదలిచాడు?" "చరిత్రలో ఈ విషయాన్ని ఈ సంఘటనను అతడు ఎందుకు పొందుపరిచాడు?" అని పరిశీలించడం.

ఒక చిన్న ఉదాహరణగా, దావీదు, గొల్యాతు సంభవమునకు తిరిగి వెళదామా! ఈ కథ చరిత్రకపరమైనది, బైబిలు ఇది జరిగినదని చెప్తుంది కాబట్టి నమ్ముదాము. ఈ వాక్యభాగాన్ని వ్యాఖ్యానించునప్పుడు మనం ఏ ప్రశ్నకు సమాధానమివ్వాలి?

1. *ఏం జరిగింది?* దావీదు - ఒక గొఱ్ఱెల కాపరియైన బాలుడు. ఇశ్రాయేలుకు రాజుగా ఉండుటకు ఇదివరకే సమూయేలుచేత అభిషేకించబడినవాడు, యుద్ధ కళలలో

అనుభవంలేనివాడు, ఫిలిష్తీయుల యోధుడైన గొల్యాతును ఓడించాడు. ఇందుకు ఫలితమేమంటే, (అ) ఇశ్రాయేలీయులు ఫిలిష్తీయుల మీద యుద్ధం గెలిచారు, (ఆ) ప్రజలు దావీదును కొనియాడారు.

2. *కథ యొక్క చారిత్రక ప్రాధాన్యత ఏమిటి?* దావీదు గొల్యాతును ఓడించడంతో సౌలు దావీదు మీద అసూయపడ్డాడు. ఇదే సౌలు దావీదు కథలో ఉన్న ఎన్నో మలుపులను తిప్పింది. అయితే ఈ గొప్ప విజయం, విశ్వాస కార్యం ప్రజలు రానున్న రోజుల్లో దావీదును తమ రాజుగా అంగీకరించేందుకు దోహదపడింది.

3. *దీనినుండి మనం ఏం నేర్చుకుంటున్నాం?* గ్రంథకర్త ప్రధానంగా ఏమని చెప్తున్నాడు? వడిసెలను విసరడంలో దావీదు సిద్ధపాటు, ధైర్యం, నేర్పరితనాన్ని మనం పొగడవచ్చు కానీ గ్రంథకర్త ఇందులో దేవుని పాత్రను ప్రధానంగా చెప్తున్నాడు. దావీదు దేవునియందు నమ్మకముంచాడు. కాబట్టి దేవుడతనికి తోడైయున్నాడు కాబట్టి దావీదు గెలిచాడు. ఈ వివరణలో దేవుడే కేంద్రబిందువు.

## పాత నిబంధన వృత్తాంతముల అర్థమును పరిశోధించడము

చివరిగా, లేఖనములను వ్యాఖ్యానించునప్పుడు, చరిత్ర గ్రంథాలలోగానీ, పాత నిబంధనలో మరో చోటగానీ ఒక వృత్తాంతము యొక్క అర్థమును మనం ఎలా గ్రహించగలము? ఇక్కడ కొన్ని సూచనలు ఇయ్యబడ్డాయి. గమనించండి.

### 1. వృత్తాంతములును ఏవో గుర్తించండి

వృత్తాంతములను అలాగే వ్యాఖ్యానించాలి. పాత నిబంధన సాహిత్యంలో వృత్తాంతములో లేదా కథలు, మనకు సామాన్యంగా కనబడుతున్నా గాని, చారిత్రక గ్రంథాలే అధిక ఆధారాలనిస్తాయి.

వృత్తాంతము ఒక కథ కాబట్టి, ఆ కథను అర్థం చేసుకోవడానికి మనం ప్రయత్నించాలి. ఇందులో నాయకులు, ప్రతి నాయకుడు, ఇతర ప్రముఖ వ్యక్తులు ఎవరు? కథకు, ఆరంభం, మధ్యమం, ముగింపు ఉంటాయి. ప్రారంభంలో వ్యక్తులను పరిచయం చేసిన తరువాత, సమస్య ఏంటో చెప్పబడుతుంది. మధ్యలో సమస్యలు మరింత తీవ్రమైన కథనాయకుడు వాటిని ఎదుర్కొని పరిష్కరించాల్సి వస్తుంది. ముగింపులో సమస్యలన్ని పరిష్కరింపబడతాయి.

కథలో ఏదయితే ప్రధానంగా చెప్పబడిందో దాని ద్వారా వృత్తాంతము యొక్క అర్థము లేదా ప్రాధాన్యత స్పష్టమవుతుంది. కొన్నిసార్లు గ్రంథకర్త మొదట్లో లేదా చివర్లో చేసిన వ్యాఖ్యలు ఆ కథ ప్రాధాన్యతను చెప్తాయి. కొన్నిసార్లు పదేపదే చెప్పబడిన మాటలు కథ ఏం చెబుతుందో సూచిస్తాయి. సాధారణంగా, కథను జాగ్రత్తగా చదువుట ద్వారా రచయిత తన పాఠకులు ఏం గుర్తించాలని కోరుకుంటున్నాడో దాన్ని గుర్తించవచ్చు.

ఉదాహరణకు, రూతు గ్రంథము ఒక అద్భుత ప్రేమ కథను చెప్తుంది. కానీ దీని ప్రాధాన్యత ఏమిటి? బైబిలులో రూతు కూడ ఎందుకని చేర్చబడింది? మొదటిగా, ఒక మోయాబీయురాలు రాజైన దావీదు వంశావళిలో ఎలా చేర్చబడిందో చెప్తుంది (తద్వారా మెస్సీయాయైన క్రీస్తు వంశవళిలో చేర్చబడింది. మత్తయి 1:5). అలాగే అన్యులు యూదులతో ఏ రకమైన సంబంధం కలిగి యుండేవారో కూడ ఈ గ్రంథం చెప్తుంది. అన్యులందరూ

యూదులకు శత్రువులు కారు అని చెప్తుంది. అన్యులు యూదులను పెళ్ళాడేవారు కొన్నిసార్లు యూదా మతాన్ని కూడ అవలంబించేవారు. అంతేకాకుండా, ఈ వృత్తాంతమును జాగ్రత్తగా చదివితే, రూతు అత్తయైన నయోమి మోయాబులో తన ఇల్లు, తన భర్త, తన జీవితం, తన కుమారులు – సర్వాన్ని పోగొట్టుకొనియుంది. కానీ ఇశ్రాయేలునకు వచ్చినప్పుడు తిరిగి ఆశీర్వదింపబడింది. తన ఉద్దేశమును యిలా చెప్పవచ్చు – "దేవుడు దేన్ని తీసివేశాడో [రూతు 1:21], దాన్ని మరలా అధికంగా పునరుద్ధరిస్తాడు."

**2. వృత్తాంతములు ఏవి కావో గుర్తించండి**

విరుద్ధ భావములలో వృత్తాంతములను చూడకూడదు. మనం అనాలోచితంగా, అశ్రద్ధగానుంటే, వ్యాఖ్యానంలో మనం తప్పులు చేయవచ్చు.

*వృత్తాంతము అనేది వివరాల సముదాయం కాదు. ప్రతి దానికి దానికంటూ ఒక భావం ఉంటుంది.* బైబిలు కథలో వివరాలు అంత ప్రాముఖ్యం కాదు అన్ని నిర్దిష్ట "అర్థాన్ని" వ్యక్తపరచవు. లేఖనాలలో దేవుడు ఒక విషయాన్ని ఖచ్చితంగా చెప్పినప్పుడు అందులో ఏదో ఒక విషయం ఆయన మనతో బోధిస్తున్నాడని భావించనవసరం లేదు. ఉదహరణకు, దావీదు గొల్యాతును చంపడానికి వెళ్ళినప్పుడు ఐదు నున్నటి రాళ్ళను తీసుకెళ్ళాడన్న వివరణ.

*పాత నిబంధన వృత్తాంతము ఒక ధర్మశాస్త్ర విధి కాదు. నేటి క్రైస్తవులకు దృష్టాంతము ఉంచియున్నది.* దేవుని చిత్తాన్ని ఎరుగుటకు గిద్యోను గొఱ్ఱెబొచ్చును (న్యాయాధిపతులు 6:36–40) ఉంచిన రీతిగా ఈనాడు మనం కూడా దేవుని చిత్తాన్ని ఎరుగుటకు అదే పనిని చేయనక్కర్లేదు.

*పాత నిబంధన వృత్తాంతము మంచి నీతియుక్తం లేదా నైతిక నడవడిని బోధించకపోవచ్చు.* నీతి సూక్తులను నేర్పించడం కంటే వృత్తాంతముల ఉద్దేశములు వేరే ఉంటాయి. నిజానికి, బైబిలు కథల్లో ఒక వ్యక్తి చేసిన పనికి తీర్పును వాక్యం ఇవ్వదు. కథలోని వ్యక్తుల పనులు నీతియుక్తమైనవా, లేదా అని ధర్మశాస్త్రంలోని విధులను అనుసరించి పాఠకుడే తీర్పు తీర్చవలసియుంటుంది. వృత్తాంతం యొక్క ఉద్దేశం ఏమంటే – ఇశ్రాయేలు కథను తెలియచెప్పడం, ప్రత్యేకించి, దేవుడు తన ఉద్దేశాలను నెరవేర్చేందుకు మనుష్యుల జీవితాలలో ఎలా పనిచేశాడో తెలియజెప్పడం. దాని ఫలితంగా, బైబిల్లోని పుస్తకాలలోని పాత్ర "బైబిలు వీరులు" అయినా – బైబిలు వాటిని ఖండించడం లేదు కాబట్టి అవి దేవునిచే ఆమోదించబడ్డాయని అనుకోకూడదు.

*బైబిలు వృత్తాంతము "లోతైన నిగూఢార్థం" ఉండే కథ కాదు.* పురాతన కాలంనుండి కూడ ఎంతోమంది వ్యాఖ్యాన కర్తలు బైబిలు కథల్లో పైకి కనబడిన లోతైన అర్థం ఉండేదని భావిస్తూ వచ్చారు. పాత నిబంధన వృత్తాంతములను ఇటువంటి భావనతో చదువుతున్నప్పుడు రెండు సమస్యలు మనకు కనబడతాయి. (1) కథలోని "ఆత్మీయ" అర్థం కోసం వెదుకుతూ ఉంటే, పాఠకులు దాని అసలు అర్థాన్ని తప్పిపోతారు. ఈ వాక్య భాగం యొక్క ప్రాధాన్యతను తెలుసుకోలేరు. (2) వాక్యంలోని "నిగూఢార్థం" కోసం వెదికేవారికి తాము చూచుచున్న అర్థం కనబడుతుంది. నిజానికి, ఈ విధానం వలన వాక్యంలోని ప్రతి వచనానికి వారికి నచ్చిన అర్థాన్ని వారు అన్వయిస్తారు.

*బైబిలు వృత్తాంతం అలంకార రూపం కాదు.* పాత నిబంధన వృత్తాంతముల నుండి

“పాఠాలు” నేర్చుకోవడంతో తృప్తి చెందని వ్యాఖ్యాకర్తలు వాటిని అలంకార ఉపమానములుగా మారుస్తుంటారు. అయితే బైబిలే ఒక విషయాన్ని రూపకంగా చెబితే తప్ప ఒక వృత్తాంతాన్ని రూపకంగా[3] మార్చడం భావంకాదు.

### 3. “రుజువు” మరియు “ఉదాహరణ” మధ్యగల భేదమును గుర్తించడం

*బైబిలులోని కొన్ని కథలు ప్రాముఖ్య సత్యములను స్థాపిస్తుండగా మరికొన్ని ఉదాహరణ ల వలే మిగిలిపోయాయి.* దావీదు గొల్యాతుతో పోరాడుటకు సిద్ధపడడం అనేది యౌవనస్థులు సిద్ధపడుటకు మాదిరిగా ఉందే గాని, దావీదు ఒక్కడే దేవుని సహాయంతో యోధుని చంపగలిగాడు అని నిరూపించడం లేదు. *సహజంగా చెప్పాలంటే, వృత్తాంతాలు క్రొత్త నిబంధనలలో సత్యస్థాపన కోసం ఉపయోగించబడితే తప్ప వాటిని ఏదైనా విషయాన్ని నిరూపించేందుకు మనం వాడకూడదు.*

కాబట్టి, వాక్య వృత్తాంతములపై బోధించునప్పుడు, “దావీదు అనుభవాన్నిబట్టి మన జీవితంలోని ‘మహాకాయుని’ కూడా మనం కొట్టగలగాలి” అని మనం బోధించకుండా జాగ్రత్తపడాలి. దానికి బదులు, “దేవుని సహాయంతో దేవునికి వ్యతిరేకంగా ఉన్న మనలోని ఆటంకములను అధికమించవచ్చు అని దావీదు అనుభవం మనకు నేర్పిస్తుంది” అని చెప్పవచ్చు. క్రైస్తవులు ఏంచేయాలన్న విషయం క్రొత్త నిబంధనలో చెప్పబడింది. పాత నిబంధన సంఘటనలు మన బాధ్యతలు, ఆధిక్యతలను తెలియజేస్తున్నాయి – అయితే క్రొత్త నిబంధనకు వేరుగా అవి ఏమి చేయలేవు – క్రొత్త నిబంధన సహాయంతో మనం ఏం చేయాలన్న విషయాన్ని చెప్తాయి.

వాగ్దాన దేశంలో, “కొండలు లోయలు” (ద్వితీయోపదేశకాండము 8:7) ఉంటాయని దేవుడు చెప్పాడని ఒక బోధకుడు పేర్కొన్నాడు. అదేవిధంగా, “మన జీవితంలోను కొండలూ, లోయలు ఉంటాయి. మంచి విషయాలు, చెడ్డ విషయాలు, సంతోష విషయాలు, దుఃఖ విషయాలు ఉంటాయని” చెప్పాడు. క్రైస్తవులు తమ జీవితంలో సంతోషాన్ని దుఃఖాన్ని ఎదుర్కోవాలి. నిజమే, అయితే, ద్వితీయోపదేశకాండము 8:7 వాక్య భాగం దీన్ని నిరూపించేందుకు లేదు. ఇది దేన్ని నిరూపించడంలేదు. ఇశ్రాయేలీయులు స్వతంత్రించుకునే దేశాన్ని ఇది వివరిస్తుంది. అంతే! వాగ్దాన దేశంలో కొండలు, లోయలున్న విషయం ద్వారా దేవుడు మనము ఆత్మీయ పాఠాన్ని నేర్పుతున్నాడనడం సందేహాస్పదమే!

మరియొక వాక్యభాగంలో కుడికైనను, ఎడమకైనను ధర్మశాస్త్రంనుండి తొలగిపోకూడదని యెహోషువా ఆజ్ఞాపించబడ్డాడు (యెహోషువ 1:7). వాక్యాన్ని వ్యాఖ్యానిస్తుండగా, మనం కూడ కుడికైనను (“అది సంప్రదాయత్వం”) ఎడమకైనను (“స్వేచ్ఛా తత్వం”) తొలగిపోకూడదని కొంతమంది చెప్తుంటారు. నిస్సందేహంగ వారు చెప్తున్నది మంచి విషయమే! క్రైస్తవులు అతి సంప్రదాయత్వాన్ని, అతి స్వేచ్ఛాతత్వాన్ని అనుసరించకూడదు. అయితే యెహోషువా 1వ అధ్యాయం ఈ విషయాన్ని వివరిస్తుందే గాని, *నిరూపించదు.*

చివరిగా, నోవహు మరియు ఓడలోనున్న ఇతరుల గురించి ఆలోచించండి (ఆదికాండము 7:23; 1 పేతురు 3:20). ఈ కథననుసరించి సంఘానికి సంబంధించిన బోధనలను నిరూపించడానికి బోధకులు ఆ కథను వాడుతారు. “అక్కడ ఉన్నది ఒకే ఒక ఓడ, అందులోనివారు మాత్రమే రక్షించబడిన విధంగానే, ఈనాడు ఒక్క సంఘమే ఉంది.

అందులోని వారు మాత్రమే రక్షింపబడతారు” అని వారు బోధిస్తారు. ఇది నిజమే యేసు ఒక సంఘాన్ని స్థాపించారు. రక్షించబడినవారు అందులో ఉంటారు. *కానీ ఓడ కథ ఈ విషయాన్ని నిరూపించదు.* అవన్నీ సత్యాలే. ఎందుకంటే అవి క్రొత్త నిబంధనలో చెప్పబడ్డాయి. అంతేకానీ ఓడ కథను బట్టి కాదు, ఓడ ఈ వాస్తవాన్ని వివరిస్తుందే కానీ నిరూపించదు.

**ముగింపు**

పాత నిబంధనలోని చారిత్రక వృత్తాంతములు ఈనాటి క్రైస్తవులకు ఎలా ఉపకరిస్తాయని? మొదటిగా, అవి క్రొత్త నిబంధన కాలానికి చారిత్రక నేపథ్యాన్నిస్తున్నాయి. మన రక్షణ మన రక్షకుని మీద ఆధారపడియుంది. ఆయన యూదునిగా జన్మించాడు, అలాగే మనం ఆత్మీయ ఇశ్రాయేలీయులము కాబట్టి ఇశ్రాయేలు చరిత్ర మన చరిత్ర! రెండవదిగా, పాత నిబంధనలోని చరిత్ర, సంప్రదాయాలని తెలుసుకోకుండా, క్రొత్త నిబంధన బోధనలను గ్రహించడం అసాధ్యం. మూడవదిగా, బైబిలు రచయితలు మరియు ఉపన్యాసకులు, తమ బోధనను వివరించడానికి లేదా నిరూపించడానికి వారు ఉపయోగించిన పాత నిబంధన సంఘటనలు, వ్యక్తులును మనము అదే కోణంలోనే ఉపయోగించాలి. పాత నిబంధన సంఘటనలను మనమూ అదే విధంగా ఉపయోగించినప్పుడు క్రొత్త నిబంధన బోధలు అర్థమవుతాయి. అయితే క్రొత్త నిబంధన సత్యములు క్రొత్త నిబంధననుండే వస్తాయని మనం గుర్తుంచుకోవాలి. ఒక పాత నిబంధన సంఘటన క్రొత్త నిబంధన సత్యమును వివరిస్తుందే గాని స్థాపించదు.

అన్వయించునప్పుడు, ఉపమానం, అలంకారములు వక్రీకరించబడకుండా జాగ్రత్తపడాలి. ఒక చారిత్రక వాక్యమును అర్థంచేసుకోవడానికి అవి ఉపకరించవు. పాత నిబంధన సంఘటనలను ఇప్పటికాలానికి అన్వయించునప్పుడు మనం జాగ్రత్త కలిగియుండాలి. వాక్యాన్ని వక్రీకరంచకుండ (2 పేతురు 3:16), దేవుడు మనకోసం యుంచిన అర్థాన్ని గ్రహించాలి.

---

సూచనలు

[1]Jack. P. Lewis, *Historical Backgrounds of Bible History* (Grand Rapids, Mich.: Baker Book House, 1971), 94. [2]గ్రీకు యోధుడు అజాక్స్ ఒక్క యుద్ధంలోని హెక్టార్ ది ట్రేజామ్మను ఓడించాడు (Homer *The Iliad* 7). [3]ధర్మశాస్త్రంతో క్రైస్తవుల సంబంధానికి పౌలు, శారా, హాగరులను ఉపయోగించాడు (గలతీయులు 4:21-31).